సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి



పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా పెక్కతేలిపోయి గోతులతో సీసీరోడ్డు



బొర్రమ్మ వనం ఎదురుగా గోతులమయంగా రహదారి



దిబ్బపాలెం పాఠశాలకు వెళ్లే రహదారిలో గోతులు

రోడ్లు శిథిలం.. ఒళ్లు హూనం!

- సీసీ రోడ్లు ధ్వంసం
- గుంతలను గుర్తించ లేక ప్రమాదాలు
- పలుచోట్ల కోతకు డ్రైనేజీలు



ఉమామహేశ్వరస్వామి ఆలయం ఎదురు రోడ్డులో శిథిలమైన కల్వర్టుపై అమర్చిన పలక



దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి లక్కరాజుపాలెం కూడలిలో రహదారి దుస్థితి



దుర్గమ్మ గుడి ఎదురుగా ప్రమాదకరంగా మలుపు



రోడ్డు మలుపులో కోతకు గురైన ప్రమాదంగా మారిన డ్రైనేజీ, రహదారి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులోని పలు కాలనీల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనుల్లో భాగంగా రోడ్లు తవ్విన అధికారులు పనులు పూర్తయిన తర్వాత సక్రమంగా పూడ్చలేదు. దీంతో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రయాణికులు వాహనాలతో ఫీట్లు చేస్తూ వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో గుంతలు గుర్తించలేక ద్విచక్రవాహన దారులు అదుపుతప్పి పడిపోతున్నారు.

పట్టించుకునే వారేరీ?

అగనంపూడి సెక్టార్–2,3 పరిధిలోని కొండయ్యవలస చిన ఆంజనేయస్వామి ఆలయం నుంచి బొర్రమ్మపాలెం నిర్మాణ సమయంలోనే కూరుకుపోవడంతో పలుచోట్ల కొత్త రోడ్డు వేశారు. అయినా ఈ రహదారి పరిస్థితి మారలేదు. బొర్రమ్మగెడ్డ నుంచి దిబ్బపాలెం పాఠశాల ఎదురు రహదారిలో సీసీరోడ్డులో వాహనాలపై వెళ్లేవారు ఊగుతూ తూలుతూ వెళ్లాల్సిన పరిస్థితి. పాఠశాల పక్క వీధి నుంచి కృష్ణ మందిరం రహదారి, బొర్రమ్మ వనం ఎదురుగా రోడ్డు తవ్వకాలు చేపట్టి మట్టిని పూడ్చి వదిలేయడంతో గోతులు ఏర్పడ్డాయి. సెక్టార్–3 నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి కూడలి, లక్కరాజుపాలెం కూడలిలో రహదారి గోతులమయంగా మారింది. అగనంపూడి హైస్కూల్ పక్క రహదారి కోతకు గురై మట్టి డ్రైనేజీలో పడిపోవడంతో సీసీరోడ్డు ఎప్పుడు విరిగి పడిపోతుందోననే భయంలో స్థానికులు ఉన్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి అగనంపూడి పాత పంచాయితీ భవనం వైపు వెళ్లే మార్గంలో కూడా డ్రైనేజీ, రోడ్డు కోతకు గురైంది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై నిత్యం రద్దీగా ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే దుర్గమ్మ ఆలయం ఎదురుగా ఉన్న రహదారి మలుపులో కూడా డ్రైనేజీ కోతకు గురైంది. ఆంధ్రా బ్యాంక్ నుంచి పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మలుపులో డ్రైనేజీపై కల్వర్టు శిథిలం కావడంతో స్థానికులు వేరే చోట నుంచి సిమెంట్ పలక తీసుకువచ్చి అమర్చారు. ఇలా నిర్వాసితకాలనీల్లో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన రహదారుల నిర్వహణ లేకపోవడంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి స్థానికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

మరమ్మతులు చేపట్టాలి



రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించిన రోడ్ల నిర్వహణను జీవీఎంసీ గాలికి వదిలేసింది. ఎప్పటికప్పుడు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి ఉంటే నిర్వాసిత కాలనీ రహదారులకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. సీసీరోడ్లు పలుచోట్ల కుదించుకుపోవడం, కోతకు గురైనా మరమ్మతులు చేపట్టక పోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. యూజీడీ నిర్మాణ సమయంలో కూడా పాత డ్రైనేజీల మీదే ప్యాచ్ వర్క్‌లు చేసి మమా అనిపించడంతో డ్రైనేజీలు శిథిలమయ్యాయి.

– యలమంచిలి అప్పారావు, దిబ్బపాలెం

కొత్తరోడ్లు వేయరా..



జీవీఎంసీ కొత్తగా కోట్లు రూపాయల వ్యయంతో అవి నిర్మిస్తున్నాం. ఇవి నిర్మిస్తున్నామని చెప్పుకుంటుంది. కాని పాత రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టకపోవడం సరికాదు. జీవీఎంసీ పాలకపక్షం స్పందించి శిథిలమైన రోడ్లు తొలగించి కొత్తవి నిర్మించాలి. ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– నక్కా నాయుడు, బీసీకాలనీ

క్లుప్తంగా

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న సింహగిరి ట్రస్టు సభ్యులు

గాజువాక: స్థానిక సాయిరాంనగర్‌లోని వైద్య గణపతి సన్నిధిలో నిర్వహించిన నృత్యప్రదర్శన ఆద్యంతం అలరించింది. వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా సింహగిరి చారిటబుల్ ట్రస్టు, సింహగిరి సంగీత అకాడమీ సభ్యులు ఆదివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను హృద్యంగా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ డాక్టర్ జమునారాణి పర్యవేక్షణలో అన్నమాచార్య కీర్తనలు, విష్ణు సహస్రనామ కీర్తనలు ఆలపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వి.ఎస్.కల్యాణ్, మౌనిక, డాక్టర్ అశ్విన్, లాలం రమణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

చిన్న వర్షానికే నిలిచిన నీరు



నెల్లిముక్కు ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

పెదగంట్యాడ:మండలంలో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ నీటిలో జారి పడతామో అని భయం భయంగా ప్రయాణాలు సాగించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్‌వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఇస్కాన్‌లో హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధాకృష్ణులు

కొమ్మాది: హరేకృష్ణ, హరేరామ అంటూ సాగర్ నగర్ ఇస్కాన్ మందిరం హరినామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆదివారం ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఎండైనా.. వానైనా..

- ఆరుబయట నిరీక్షించాల్సిందే



నడుపూరు గాంధీపార్కు వద్ద బస్సుకోసం ఎదురు చూస్తున్న మహిళలు



పెదగంట్యాడ కూడలి వద్ద రోడ్డు పై నిల్చున్న మహిళలు

పెదగంట్యాడ:మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నడుపూరు, నెల్లిముక్కు, హౌసింగ్‌బోర్డు కాలనీ, పెదగంట్యాడ జంక్షన్ ప్రధాన కూడళ్లు . ఇక్కడ నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ కూడళ్లకు చేరుకోవాలి. ఇక్కడ బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు చాలా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకుంది. ఎండైనా.. వానైనా రోడ్డు పైన నిల్చొని బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు చొరవ తీసుకుని ఈ ప్రధాన కూడళ్ల వద్ద బస్సు షెల్టర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



టిడ్కో గృహ సముదాయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ సహాయ కార్యదర్శి సత్యనారాయణ

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి సరికాదని, వెంటనే హౌసింగ్ ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కిందట నిర్మించిన ఫ్లాట్లు కేటాయించినప్పటికీ కనీసం వసతులు కల్పించలేదన్నారు. దీంతో లబ్ధిదారులు కాలనీలో ఉండేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే కనీస వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.ఆనంద్, విష్ణుమూర్తి, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘ నాయకులు ఎ.గోపి, మల్లేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!



74వ వార్డు చైతన్య పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిపై చెత్త కుప్ప

పెదగంట్యాడ: మండలంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఓ పక్క వర్షాలతో ప్రజలు రోగాలు బారిన పడుతుంటే.. పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ చైతన్య పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిలో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను రోజుల తరబడి తరలించక పోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

ముగిసిన వినాయక ఉత్సవాలు



ఊరేగింపును ప్రారంభిస్తున్న కాలనీ పెద్దలు, నిర్వాహకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సమీపంలో యాతపాలెం సిద్ధూ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాలు శనివారం అర్ధరాత్రితో ముగిశాయి. అన్న సమారాధన, అభిషేకాలు, దీపాలంకరణ చేసి శనివారం రాత్రి భారీ ఊరేగింపుతో గణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు. కార్యక్రమంలో సిద్ధూ యూత్ ప్రతినిధులు చేబోలు శంకరరావు, పిల్లి అప్పారావు, రీసు శ్రీను, పిల్లి హరీష్, పవన్‌కల్యాణ్, పిల్లి శంకర్, ఇతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



కొమ్మాది జంక్షన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం కొమ్మాది జంక్షన్ ఏకే ప్యాషన్స్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమ పోస్టర్‌ను సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.రాజ్‌కుమార్, టి.తిరుపతిరావు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చకర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జిప్సా ప్రతినిధులు

గాజువాక: గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, గాదె శ్రీనివాసులు నాయుడు ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ, ప్రైవేట్ అనే తారతమ్యం లేకుండా విలువలతో కూడిన బోధన చేయాలని, అందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, రమణాజీ, జిప్సా ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, పాలవలస భాస్కరరావు, ఎస్.షణ్ముఖరావు, బాబూరావు, ఎం.జగ్గారావు, మురళీసుందర్, శ్రీధర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా



బకాయిలు చెల్లించాలని సినర్జీస్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహిస్తున్నారు. యాజమాన్యం తమకు ఆరు మాసాల జీతాలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తుందని సంస్థ కార్మికులు ఆందోళనబాట పట్టారు. మూడు రోజుల నుంచి సంస్థ గేటు వద్ద ధర్నా చేపడుతున్నా యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దారుణమని కార్మికులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఆరు మాసాలు మాత్రమే జీతాలు చెల్లించిందని, మిగిలిన ఆరు మాసాలు జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడంతో గతిలేని పరిస్థితిలో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని కార్మికులు చెప్పారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐల నిమిత్తం తమ జీతాల నుంచి డబ్బులు కోత విధిస్తున్నా ఆయా సంస్థలకు చెల్లించకుండా అన్యాయం చేస్తుందని కార్మికులు రగిలిపోతున్నారు. సంస్థలో 20 నుంచి 25 సంవత్సరాలు పాటు సేవలు అందించిన తమకు యాజమాన్యం తీరని అన్యాయం చేస్తుందని.. పిల్లల పాఠశాలల ఫీజులు చెల్లించుకోలేక, ఒకపూట తింటే మరోపూట పస్తులు ఉండాల్సి వస్తుందని వాపోయారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి న్యాయంగా బకాయిలు చెల్లించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాస్, దాస్, హరిబాబు, బషీర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ భారత్



చెత్తా చెదారాలు తొలగిస్తున్న సభ్యులు



87వ వార్డులో పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారం వైపు నున్న వీఐపీ లాంజ్, ఇతర ప్రాంతాల్లో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. దువ్వా రైల్వే యూజర్స్ అసోసియేషన్‌తో పాటు పలు సేవా సంఘాలు పాల్గొని ప్లాట్‌ఫారం వైపు, ట్రాక్‌లపై పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తొలగించారు. వీఐపీ లాంజ్‌లో మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు వి.జాషువ, కె.ఈశ్వర్, బి. కామేశ్వరరావు, ఆర్.రవి, విజయ్‌కుమార్, పీఎంకే లక్ష్మి, గుదే సుశీలా గజేంద్రరావు, సుందరమూర్తి, ఆశీర్వాదం,సాయిరామ్‌రాజు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.విజయ్‌కుమార్ తన కుమార్తె వాణి జన్మదినం సందర్భంగా పేదలకు గొడుగులు పంపిణీ చేశారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. కాలనీలోని వాకర్స్ పార్కును శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ చేరిన నీటి నిల్వలను తొలగించారు. రోడ్లపైఉన్న చెత్తా చెదారాన్ని ఏరి పారవేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు పరమానందం, విశ్వేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి శివారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర



రామకృష్ణాపురంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గాజువాకలో ఈ నెల 11న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురంలో చేపట్టిన పాదయాత్రలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని పక్కన పెట్టేశారని విమర్శించారు. కూటమి నాయకులు ప్రధానమంత్రి మోడీపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 46 ముక్కలుగా చేసి దొడ్డిదారిన ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా అడ్డుకోవడానికి గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్ర కుమార్, రత్నం, ఆదినారాయణ, గణపతి, లక్ష్మీనారాయణ, రాము పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ పీవీఎస్ఎన్ రాజు

సబ్బవరం: తమతో ఐదేళ్ల పాటు చదువుకుని ఆకాల మరణం పొందిన స్నేహితుడి జ్ఞాపకార్థం మిత్రులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో 2005–06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ టోర్నీని శాప్ డైరెక్టర్ పీవీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌కు చెందిన కర్రి శేషు 2022లో పాము కాటుకు గురై మరణించాడు. శేషు వాలీబాల్ ప్లేయర్ కావడంతో గత మూడేళ్లుగా ఆయన పేరిట ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులను అందించి స్నేహితుడి గొప్పతనాన్ని ఏటా ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఆయన ఆర్థిక సాయంతో క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందించారు.